## ప్రజాస్వామ్యానికి స్ఫూర్తి మంత్రం

# రామతులశమ్మ

### 95 ఏండ్ల వయసులో ఓటేసి ఆదర్శంగా నిలిచిన బామ్మ

**వనం నాగయ్య, కెరటం న్యూస్ ప్రత్యేకం**



అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నా కూడా ప్రజాస్వామ్యాన్ని బతికించడానికి ప్రధాన ఆయుధంగా రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు నిరక్ష్యం చేసే వారికి 95ఏండ్ల వయసున్న ఆమె పట్టుదల ఒక మార్గ నిర్దేశం. 'కొంతమంది యువత పుట్టుకతో వృద్ధులు..' అని ఒక మహా కవి చెప్పినట్టుగా ఓటుకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించేలా తొమ్మిదిన్నర దశాబ్దాల వయసులో ఆమె వేసిన ఓటు నేటి తరానికే కాదు భవిష్యత్ తరాలకు సైతం ఒక దిక్సూచీగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆమె వయసు దాదాపు సెంచరీకి చేరువ అవుతున్నా ఆమె ఓటు వేసే సమయంలో ప్రజాస్వామ్యాన్ని బతికించేందుకు మనకు రాజ్యాంగం కల్పించిన ఒకే ఒక్క ఆయుధం ఓటేనని ప్రగాఢంగా విశ్వసించే ఆమెలో కనిపిస్తున్న ఆత్మవిశ్వాసం మనందరికీ ఆదర్శం. ఇంతకీ ఆమె ఎవరనేగా ఖమ్మం గాంధీచౌక్‌లోని శ్రీవెంకటరమణ ఫెర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్, సీడ్స్ దుకాణం నిర్వాహకులు నలజాల వీరభద్రం, నలజాల సత్యనారాయణ గారి మాతృమూర్తి నలజాల రామతులశమ్మ గారే. వారి స్వగ్రామం కూసుమంచి మండలం నేలపట్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్రంలో రెండో దశ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఆదివారం పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో రామతులశమ్మ వారి స్వగ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకుని నేటి తరానికి ఆదర్శంగా నిలిచారు. ఆమె తన ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకోగానే పోలింగ్ సిబ్బంది ఆమెకు సహకరించి స్వేచ్ఛగా ఓటు వేసేలా అవకాశం కల్పించారు. దీంతో పాటు అక్కడున్న పలువురు రామతులశమ్మ స్ఫూర్తికి అభినందనలు తెలిపారు.

**ప్రజాస్వామ్యం విలువలు పంచిన కుటుంబం ఆమెది...**

95 ఏండ్ల వయసులో తన ఓటు హక్కును వినియోగించుకుని శభాష్ అనిపించుకున్న నలజాల రామతులశమ్మ కుటుంబం ప్రజాస్వామ్యానికి అత్యంత విలువనిచ్చేవారిగా పేరుంది. ఆమె భర్త నలజాల వెంకటేశ్వరరావు సర్పంచ్‌గా 1960వ దశకంలోనే నేలపట్ల, లోక్యాతండా, కోక్యాతండ, అగ్రహారం గ్రామాలకు ఉమ్మడి సర్పంచ్‌గా మూడు సార్లు ఎన్నికైనారు. ఆయన గ్రామానికి చేసిన సేవలు నేటికీ ఆ గ్రామం మరిచిపోలేదంటే అతిశయోక్తి కాదు. నేటి రోజుల మాదిరిగా మద్యం, మాంసం, డబ్బు ప్రలోభాలకు ఏమాత్రం స్థానం లేని ఆ రోజుల్లో ప్రజాస్వామ్య విలువలతో గ్రామ సర్పంచ్‌గా పనిచేసి గ్రామస్తుల మదిలో ఎన్నటికీ చెరగని ముద్ర వేసుకున్న నలజాల వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులంటే ఆ ప్రాంతంలోని గ్రామాలలో ఒక సమున్నతమైన గౌరవం, మర్యాదలు దక్కుతున్నాయి. అలాంటి విలువలు కలిగిన గృహిణిగా నలజాల రామతులశమ్మ తన కుటుంబాన్ని తీర్చిదిద్దడంలో ఎంత శ్రద్ధ చూపారో నాడు తన భర్త వెంకటేశ్వరరావు సర్పంచ్‌గా ఉన్న సమయంలో తమ గ్రామస్తులకు ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకున్నారని ఆ ఉమ్మడి గ్రామాల ప్రజలు నేటికీ గుర్తు చేసుకుంటున్నారు. అలాంటి ఆమె స్ఫూర్తికి నేటి తరం అభినందిస్తున్నారు.